క్లుప్తంగా

చిత్రకారుడికి కలెక్టర్ అభినందన



కలెక్టర్‌కు చిత్రాన్ని అందజేస్తున్న రాజేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ హనుమాన్ బస్తీకి చెందిన కవి, చిత్రకారుడు భూక్యా రాజేష్ కలెక్టర్ చిత్రాన్ని పెన్సిల్‌తో అద్భుతంగా గీశాడు. ఆ చిత్రాన్ని గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజేష్‌ను అభినందించారు.

మళ్లీ నాలుగేళ్లకు పెళ్లిరోజు..!



నూతన వధూవరులు గాయత్రి, వినయ్

పాల్వంచరూరల్: ముహూర్త బలం బాగుండడంతో ఓ జంట ఫిబ్రవరి 29, 2024న గురువారం వివాహం చేసుకున్నారు. పాల్వంచ మండలం పెద్దమ్మగుడి వద్ద పాల్వంచకు చెందిన పగిళ్ల గాయత్రి, కొత్తగూడెం మండల రామవరానికి చెందిన వినయ్‌ల పెళ్లి ఘనంగా జరిగింది. వీరికి మళ్లీ నాలుగేళ్లకే అంటే 2028లో మొదటి పెళ్లిరోజు వచ్చేది అంటూ వచ్చిన బంధువులు, స్నేహితులు చర్చించుకున్నారు.

సింగరేణి(కొత్తగూడెం): రామాంజనేయ కాలనీకి చెందిన పిండి సుమంత్, మహారాష్ట్రలోని గచ్చిరోలు జిల్లా శిరువంచ గ్రామానికి చెందిన అక్షిత గురువారం శిరువంచలో పెద్దల ఆశీస్సులు, వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యారు.



నూతన దంపతులు సుమంత్, అక్షర

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న రవి

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన తాతపుడి రవి, కుమారి దంపతులు రూ.20,116 విరాళాలు అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం తెలిపారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

టేకులపల్లి: మొక్కంపాడు తండా గ్రామంలో గురువారం శ్రీ అభయ ఆంజనేయస్వామి గుడిలో ఒంటె వాహన ప్రతిష్ఠా మహోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంటె వాహన ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. హనుమ వాహనం ఒంటె దాతలు రెడ్డి రౌతు రత్నరావు సోదరులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కొనసాగుతున్న సమ్మె

టేకులపల్లి: పీఎంహెచ్ (ఇంటర్, డిగ్రీ బాలికలు, బాలుర వసతి గృహాలు)లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్ల 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరింది. సమ్మెకు సంఘీభావంగా హాజరైన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని, జీఓ నంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం ఇవ్వాలని, ప్రతీనెల మొదటి వారంలో వేతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్కర్ల సమస్యను ఉన్నతాధికారులకు తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డీడీ, ఏటీడీఓలు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు తాటి రాంబాబు, తోలెం సుజాత, హలావత్ అనిత, తాటి భారతి, పాయం విజయభారతి, ఈసం స్వరూప, కుంజా జయ, అజ్మీర కిషన్, గడ్డం బాబురావు, కల్తి శ్రీను పాల్గొన్నారు.

సెంట్రల్ లైట్లు వెలిగేదెన్నడు?

- రెండేళ్లుగా పూర్తికాని డ్రెయినేజీల నిర్మాణం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
- పట్టించుకోని అధికారులు



జూలూరుపాడులో ప్రారంభానికి నోచుకోని సెంట్రల్ లైటింగ్

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.5.22 కోట్లతో జూలూరుపాడులో తల్లాడ-భద్రాచలం రాష్ట్రీయ రహదారికి డ్రెయినేజీల నిర్మాణం, డివైడర్‌ను గ్రిల్స్‌తో ఆధునీకరించి సెంట్రల్ లైటింగ్ పనులను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. 2022, ఏప్రిల్ 4న గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగింది. డివైడర్‌పై గ్రిల్స్, సెంట్రల్ లైటింగ్ పనులు అయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోగా, డ్రెయినేజీ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాసిరకంగా నిర్మించిన డివైడర్‌పైనే ఐరన్ గిల్స్ ఏర్పాటు చేయడంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో గాలికి ఊగుతుండగా, పాదచారులు ఎవరైనా గ్రిల్స్ తాకితేనే కదులుతున్నాయంటే ఎంత నాణ్యతా ప్రమాణాలు పాటించారో అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ కోసం 64 పోల్స్ ఉండగా ఒక్కో పోల్‌కు రెండు చొప్పున 128 లైట్లు, మెయిన్ సెంటర్ల వద్ద నాలుగు లైట్ల పోల్స్ 4 ఏర్పాటు చేశారు. పనులు పూర్తి అయి నాలుగు నెలలవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపట్టిన నాటి నుంచి ఆటంకాలు, అవరోధాల నడుమ కొనసాగుతున్నాయి. జూలూరుపాడు పట్టణ పరిధిలో ఆర్‌అండ్‌బీకి చెందిన తల్లాడ-భద్రాచలం రాష్ట్రీయ రహదారి 55 అడుగులు ఉండగా 50 అడుగులతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లకు నష్టం తగ్గించేందుకు ప్రజల అభ్యర్థన మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు 50 అడుగులకు మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. ఆ తరువాత చంద్రుగొండ క్రాస్ రోడ్ నుంచి 400 మీటర్లు దూరం డ్రెయినేజీ నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు 33 అడుగులు మార్కింగ్ ఇవ్వగా వెంగన్నపాలెం గ్రామ ప్రజలు ఆ నాటి ఎమ్మెల్యే రాములు నాయక్‌ను కలిసి 30 అడుగుల్లోనే డ్రెయినేజీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. 30 అడుగులకు కుదించి డ్రెయినేజీలు నిర్మించారు. అయితే మురుగు నీరంతా వెంగన్నపాలెం శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద నిలిచి దుర్వాసన వెదజల్లుతుండటంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్ స్థానికుడు కావడంతో ఎవరినీ కాదనలేక ముందుకు సాగే పరిస్థితి లేదు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వరకు 1.9 కిలోమీటర్ల మేర డ్రెయినేజీ నిర్మించాలి. ఈ క్రమంలో సైడ్ వాల్స్ నాసిరకంగా నిర్మించడంతో గత ఏడాది సాయిబాబా ఆలయం సమీపంలో 150 మీటర్ల మేర సైడ్ వాల్ కూలిపోయింది. ఇటీవల తిరిగి పనులు ప్రారంభించారు కానీ, మరోవైపు డ్రెయినేజీ నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మించకుండానే వదిలేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాసిరకంగా పనులు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా నిర్మించడంతో చెత్తచెదారం, వ్యర్థపదార్థాలు ఎటు వెళ్లే పరిస్థితి లేక ఎక్కడిదక్కడే నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లుతుండటంతో అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా దుకాణాల ముందు వరద నీరు నిలుస్తోందని, ఆ నీటిని డ్రెయినేజీలోకి మరలించడంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా ఉంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ

దుర్వాసన వస్తోంది...



డ్రెయినేజీల నుంచి దుర్వాసన వస్తోంది. ఇళ్లల్లోని వాడకం నీరంతా సైడు కాల్వల్లో నిల్వ ఉండటంతోపాటు, చెత్తచెదారం, వ్యర్థ పదార్థాలు వేయడంతో అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు నిల్వ ఉంటోంది. ఓపెన్ డ్రెయినేజీలు కావడంతో మరింత ఇబ్బందికరంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – బాళ్ల శ్రీనివాస్, వెంగన్నపాలెం

సెంట్రల్ లైట్లు ప్రారంభించాలి...



రెండేళ్లుగా అభివృద్ధి పనులు పూర్తి కావడం లేదు. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడం లేదు. డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం వస్తే ఇబ్బందిగా ఉంది. దుకాణాలు, ఇళ్ల ముందే మురుగు నిలుస్తోంది. అధికారులు త్వరగా పనులు పూర్తి చేయించాలి.

– కిన్నెర రాములు, వ్యాపారి వెంగన్నపాలెం

త్వరలో ప్రారంభిస్తాం..



సెంట్రల్ లైటింగ్, గ్రిల్స్ పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ వెంగన్నపాలెం గ్రామ పంచాయతీకి అప్పగించారు. త్వరలో లైట్లు ప్రారంభిస్తారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వరకు ప్రధాన రహదారిని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– తోట తులసీరామ్, ఎంపీఓ, జూలూరుపాడు

మంత్రి పొంగులేటికి వినతుల వెల్లువ...



ఇల్లెందు: మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్డీ నాయకుడు మధు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతులు వెల్లువెత్తాయి. గురువారం ఇల్లెందు సింగరేణి హైస్కూల్‌లో ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు అందజేసిన వినతిపత్రంలో కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు చేయాలని, ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, ఓసీలు రద్దు చేసి మైన్‌లు ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలని కోరారు. మధు వెంట ఎన్డీ నేతలు టి. నాగేశ్వరరావు, సారంగపాణి, మోకాళ్ల కృష్ణ ఉన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నుంచి పలువురు మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇల్లెందు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు కమల్ కోరీ, గుండంపల్లి సతీష్, విజయ, మేకల మల్లేష్, యాకుబ్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీ గుట్ట వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పూజలు నిర్వహించారు. గురువారం దమ్మపేట పర్యటన ముగించుకుని పాల్వంచ మీదుగా కొత్తగూడెం వెళుతుండటంతో మార్గమధ్యలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ ఏరియాలోని కాంగ్రెస్ నాయకుడు చీకటి కార్తీక్ ఇంటిని సందర్శించి కార్తీక్ కూతురు భవిష్య ఇటీవల మొదటి పుట్టిన రోజు వేడుక జరిగిన సందర్భంగా ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, ఐతా గంగాధర్, బీఎస్ చారి, ఖరీంపాషా, సాంబయ్య, ఆనంద్, ఇమ్మానియేల్, వినయ్, మోహన్, ఖాజామియా, హుస్సేన్, లింగ్యా నాయక్, రాంబాబు, ఉదయ్, సత్తార్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పది గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ పీబీ కన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ముత్యాలంపాడు ఫీడర్‌లో వ్యవసాయ రైతుల నిమిత్తం అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ముత్యాలంపాడు, రాంపురం, పాతతండా, కొత్తతండా(పి), తావుర్యాతండా, స్టేషన్‌తడికలపూడి, కోక్యాతండా, పాతతడికలపూడి, లక్ష్మీపురం, ఈర్యాతండాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థి మృతికి ప్రభుత్వానిదే బాధ్యత..

టేకులపల్లి: ఆదిలాబాద్ జిల్లా మాంగుర్లల గ్రామంలో శివకుమార్ అనే ఇంటర్ విద్యార్థి ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన కారణంగా తాను పరీక్ష రాయలేకపోయానని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆ విద్యార్థి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోశాధికారి జె.గణేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రవాణా సౌకర్యం సరిగా లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని ఈ క్రమంలో పరీక్షలకు తగిన సమయంలో విద్యార్థులు ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. ఈ నిబంధనను సడలింపు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులకు 7గంటలకే వెళ్లాలి



కూలీలతో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: ఎండలు రోజురోజుకు తీవ్రం అవుతున్న దృష్ట్యా ఉపాధి కూలీలు ఉపాధి పనులకు ఉదయం 7గంటలకే వెళ్లాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. లక్ష్మీదేవిపల్లి, బసవతారకకాలనీ, కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలు ప్రతీరోజు రూ.272 వేతనం వచ్చే విధంగా పనులు చేయాలని చెప్పారు. నర్సరీలో ప్రతీ కుటుంబానికి హోమ్‌స్టెడ్ ప్లాంటేషన్ కింద ఆరు మొక్కలను అందించేందుకు అవసరమైన మొక్కలను నర్సరీలో పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, సాయిరాం, క్షేత్ర సాంకేతిక సహాయకులు రజిత, శంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు మృతి తీరని లోటు



స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీరాములు మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరని లోటని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. మండలంలోని మాణిక్యారం గ్రామంలో కోడి శ్రీరాములు స్మారక స్తూపాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటైన సంస్మరణ సభలో మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ, పోడు భూములు, ప్రజా సమస్యలపై న్యూడెమోక్రసీ నిర్వహించిన ఆందోళనలలో కోడి శ్రీరాములు తన ఆటపాటలతో ప్రజలను ఉద్యమం వైపు నడిపించారని గుర్తుచేశారు. ఎన్నికల్లో న్యూడెమోక్రసీ అభ్యర్థుల విజయం కోసం తనవంతు పాత్ర పోషించారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక నిర్ణయాలపై గళమెత్తి ఉద్యమాలలో శ్రీరాములు కదం తొక్కారని కీర్తించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ఉద్యమంలో కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ, నాగన్న, ఆవునూరి మధు, పాడుగు నర్సింహారావు, యదళ్లపల్లి సత్యం, దాసు, అండె మంగ, తుపాకుల నాగేశ్వరరావు, యాకన్న, మోకాళ్ల కృష్ణ, బండారు ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించి విద్యార్థులు సక్రమంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, జిల్లా అధ్యక్షురాలు కె.సంధ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎ.సాంబ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమన్యు, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జె.గణేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు రామ్‌చరణ్ మాట్లాడుతూ... జిల్లా వ్యాపితంగా సంక్షేమ హాస్టళ్లలో వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న 18 నెలల కాలం వేతనాలను మంజూరు చేయాలని కోరారు. వారి ఇతర సమస్యలను కూడా పరిష్కరించి విధులకు హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు జరుగుతున్నందున గిరిజన పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలలో ఉంటున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు వంటచేసే వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలకు సకాలంలో హాజరు కాలేకపోతున్నట్లు చెప్పారు. వంటను విద్యార్థులే చేసుకోవడం వల్ల ఉడికీ ఉడకని అన్నం తిని అనారోగ్యం పాలవుతూ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నారని వివరించారు. ఆరునెలలుగా ఫైనాన్స్ విభాగం అప్రూవల్ పొందని రూ.30 కోట్ల చెక్కును ఆశగా చూపి వర్కర్లను అధికారులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోతే అధికారులను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.

మున్సిపల్ పాలకవర్గ సమావేశం



ఇల్లెందు: హాజరైన కౌన్సిలర్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులంతా ఎజెండాలోని 20 అంశాలపై చర్చించి ఆమోదించారు. వాటిలో ప్రధానంగా రెండుగా ఉన్న ఇంటి నంబర్ల తొలగింపు, తాగునీటి ఇంటర్నల్ పైపులైన్లకు రూ.5లక్షలు కేటాయింపు, కిన్నెరసాని నీటి సరఫరా రేగళ్ల కాల్వ తండాలో సీసీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టుట మరో 17 అంశాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ శేషాంజన్‌స్వామి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని ఏకైక చిల్డ్రన్స్ పార్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ పాలకవర్గం సభ్యులు తీర్మానించారు. గురువారం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎనిమిది ఎజెండా అంశాల మీద చర్చించారు. ముఖ్యంగా శానిటేషన్, మంచినీటి సరఫరా లోటు రాకుండా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన తొలి సమావేశానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలీ, సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



మాట్లాడుతున్న డాక్టర్ కవిత

ఇల్లెందురూరల్: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతీఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కవిత సూచించారు. మండలంలోని రొంపేడు పీహెచ్‌సీలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై గురువారం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించుకోవాలన్న విషయమై గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. సబ్‌సెంటర్ల వారీగా వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి సమాచారం చేరుకునేలా ప్రణాళికా బద్ధంగా ప్రచారం చేపట్టాలన్నారు. పోలియో దినోత్సవం రోజున ఏర్పాటు చేసిన సెంటర్లలో చిన్నారుల హాజరును ప్రతీగంటకు సమీక్షించుకుంటూ అవసరమైతే అదేరోజు ఇంటికి వెళ్లి లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేయాలన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత



ట్రోఫీ అందజేస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి సంస్థ క్రీడలకు, క్రీడాకారులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వర్క్ పీపుల్ స్పోర్ట్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ... 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక దారుఢ్యం లభిస్తుందని తెలిపారు. జేకే కాలనీలో వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఇల్లెందు..

సింగరేణి వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో ఇల్లెందు పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం ఇల్లెందు సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ... విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. సైన్స్‌ఫేర్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఏజీఎం(ఐఈ) గిరిధర్‌రావు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, హెచ్ఎం టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరుగురికి పదోన్నతులు

సింగరేణి ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు 2024 మార్చి 1 నాటికి అర్హత కలిగిన వారికి కేడర్ స్కీం/ టైం బాండ్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆరుగురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జీఎం జాన్ ఆనంద్ ఉత్తర్వులు అందజేశారు. ఈ మేరకు గురువారం జీఎం కార్యాలయంలో జీఎం మాట్లాడుతూ.. ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఏజీఎం(ఐఈ) గిరిధర్‌రావు, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు



జూలూరుపాడు: పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ...

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నిర్దేశించిన సమయం కంటే విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రాల్లోకి పంపించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కొంతమంది చివరి నిమిషంలో ఉరుకులు, పరుగులతో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నోడల్ అధికారులు, తహసీల్దార్లు పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: హాల్‌టికెట్ల నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



టేకులపల్లి: చివరి నిమిషంలో పరుగులు తీస్తున్న విద్యార్థులు, పరీక్ష కేంద్రం వద్ద..



జూలూరుపాడు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు